క్లుప్తంగా

శభాష్ సురేష్


ఎల్బ్రస్ పర్వతంపై సురేష్‌బాబు

కర్నూలు(సెంట్రల్): యూరప్ ఖండంలోని ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి కర్నూలు జిల్లా గోనెగొండ్లకు చెదిన సురేష్‌బాబు శభాష్ అనిపించుకున్నారు. ఆయన తల్లిదండ్రులు పేదలు అయినా పర్వతాధిరోహితుడుగా రాణిస్తుండడంతో జిల్లా ప్రజలు అభినందలు తెలుపుతున్నారు. తాను ఎల్బ్రస్‌ను అధిరోహించడానికి కృషి చేసిన కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 6వ తేదీన పీ – 4 పాలసీలో భాగంగా సురేష్‌బాబుకు అర్సెల్ మిట్టల్ కంపెనీ రూ.4 లక్షల ఆర్థిక సాయం అందించడంతో ఈ ఘనత సాధించారు.

డాగ్ షెల్టర్‌కు స్థల పరిశీలన


బస్తిపాడు సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం డాగ్ షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. గురువారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని స్థలాలను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జననివాస ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద ఉండరాదనే సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా డాగ్ షెల్టర్ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మనోహర్ రెడ్డి, డీఈఈ గిరిరాజ్ పాల్గొన్నారు.

ఐ కలెక్షన్ సెంటర్‌గా గుర్తింపు


కలెక్టర్ పి.రంజిత్ బాషా నుంచి అనుమతి పత్రం అందుకుంటున్న డాక్టర్ సుధాకర్‌రావు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు నగరంలోని బుధవారపేటలో ఉన్న సుశీల నేత్రాలయకు ఐ కలెక్షన్ సెంటర్‌గా అనుమతినిస్తూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన కాపీని గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కంటి వైద్యులు డాక్టర్ పి.సుధాకర్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుశీల నేత్రాలయలో ఇప్పటివరకు 100కు పైగా కార్నియా మార్పిడి ఆపరేషన్లు చేశామన్నారు. ఇకపై తాము సేకరించే నేత్రాలు హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్, వాసన్ ఐ బ్యాంక్‌లకు పంపి వారి ద్వారా తిరిగి పొంది ఇక్కడ కార్నియా మార్పిడి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కంటి వైద్యులు డాక్టర్ పి.రాఘవ ప్రీతం పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలుద్దాం

కర్నూలు (టౌన్): పార్టీలో బీసీ వర్గాలకు ఉన్న ప్రత్యేక గుర్తింపును వివరించి బీసీలకు అండగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ స్పష్టం చేశారు. పులివెందుల ఎన్నికల్లో టీడీపీ గుండాల దాడిలో తీవ్రంగా గాయపడి కొలుకున్న ఆయన్ను వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు గురువారం ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలు, మహిళలు మళ్లీ వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే తనపై, బీసీలపై దాడులు చేస్తున్నారన్నారు. ఐక్యంగా ఉందాం, రాబోయే రోజులు మనవే అని స్పష్టం చేశారు.

యూరియా కొరత రానివ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో యూరియా కొరత ఏర్పడకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియాను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి వారి షాపులను సీజ్ చేసి డీలర్‌షిప్‌లను రద్దు చేయాలని, లేదంటే కొరత పేరుతో రైతులను మభ్యపెట్టి అధిక ధరలకు విక్రయాలు చేస్తారని వివరించారు. ఆయన వెంట సీఐటీయూ నాయకులు విజయ్ ఉన్నారు.

ఆర్‌యూ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

కర్నూలు కల్చరల్: డాక్టరేట్‌ను అందుకున్న రాయలసీమ యూనివర్సిటీ ఎంసీఏ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎమ్.విజయ్‌కుమార్‌ను వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అభినందించారు. కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీ కంప్యూటర్ ప్రొఫెసర్ టి.అనురాధ పర్యవేక్షణలో 'ఏ నావెల్ ఎక్స్‌పర్ట్ సిస్టమ్ ఫర్ కౌన్సిలింగ్ సైకలాజికల్లీ డిప్రెస్డ్ స్టూడెంట్ కమ్యూనిటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు తనకు పీహెచ్‌డీ అవార్డు లభించిందని విజయ్‌కుమార్ తెలిపారు.


స్ఫూర్తి నింపిన గాంధీజీ మాటలు



స్వాతంత్య్రోద్యమ కాలంలో జాతిపిత గాంధీజీ ప్రసంగం ఆదోని ప్రజల్లో స్ఫూర్తి నింపింది. 1926లో బ్రిటీష్ ప్రభుత్వం ఉప్పుపై పన్ను విధించింది. ఇందుకు నిరసనగా గాంధీజీ పాదయాత్ర చేపట్టి దేశ ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చేందుకు యత్నించారు. ఇందులో భాగంగా 1930 సెప్టెంబర్ 30న కర్ణాటకలోని సండూరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొని అనంతరం రైలులో ఆదోనికి చేరుకున్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో జాతిపిత ఉద్వేగంగా హిందీలో ప్రసంగించారు. పట్టణానికి చెందిన చున్నీలాల్ జయచంద్ సోనో ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. ఈ ప్రసంగం స్థానిక ప్రజల్లో స్వాతంత్య్ర సమర స్ఫూర్తిని నింపింది.

స్వాతంత్య్ర యోధులు..
కందనవోలు ముద్దుబిడ్డలు

- బ్రిటీష్ వారితో తలపడిన వీరులు
- ఎందరో జైలుకెళ్లిన వైనం
- పేదల విద్యాభివృద్ధికి పలువురి కృషి
- నేడు 79వ స్వాతంత్య్ర దినోత్సవం


సర్దార్ నాగప్ప


గులాం రసూల్ ఖాన్


మేడం వెంకయ్య శెట్టి


సర్దార్ అమరావతమ్మ

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన పలువురు యోధులు స్వాతంత్య్ర సంగ్రామంలో బ్రిటీష్ వారి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేశారు. వారి సంకెళ్ల నుంచి భారతావనికి విముక్తి కలిగించేందుకు పోరాడారు. తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారు. మరికొందరు గాంధీజీ పిలుపునందుకుని స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని చెరసాల పాలయ్యారు. వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛావాయువులను అనుభవిస్తున్నాం. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79 ఏళ్లు అవుతున్న సందర్భంగా సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం.

స్వాతంత్య్ర సంగ్రామంలో స్ఫూర్తి ప్రధాతలు

ఉమ్మడి జిల్లాకు చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కర్నూలు నవాబ్ రసూల్ అలీఖాన్, ముత్తుకూరు గౌడప్ప, రెడ్డెక్కమ్మ, మొహియుద్దీన్ ఖాద్రి బియాబానీ, నిడవర్తి వెంకటసుబ్బయ్య, ఖాదర్‌బాద్ నర్సింగరావు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, వనం శంకర శర్మ, నివర్తి వెంకట సుబ్బయ్య, టి.చిదంబరం, ఆర్‌కే రామ్, గామాగో, చిదంబరం, మేడం వెంకయ్య శెట్టి లాంటి అనేక మంది సాతంత్య్ర పోరాటాలకు నాయకత్వం వహించి ప్రజలను ఏకం చేశారు. గాడిచెర్ల విజయభేరి, ప్రేమ, తుంగభద్ర, దక్కన్ వైశ్య, మాణిక్య ప్రభ, ఉపాధ్యాయ, భద్రవాణీ లాంటి పత్రికలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెలువడుతూ ప్రజలను చైతన్య వంతులను చేశాయి. శంకర నారాయణ భజన మందిరం, హిందూ మహమ్మదీయ సంఘం, యూనియన్ క్లబ్ దేశాభిమాని సభ లాంటి సంస్థలు ప్రజల్లో స్వాతంత్య్ర కాంక్ష పెరగడానికి ఉద్యమం వైపు అడుగులు వేయడానికి ఎంతగానో కృషి చేశాయి.

ఖద్దరు నిధికి విరాళాలు


1929 మే నెలలో గాంధీజీ ఆలిండియా ఖద్దరు యాత్రలో భాగంగా జిల్లాలోని చాగలమర్రి, నల్లగట్ల, శిరువెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, నంద్యాల, అయ్యలూరు, పాణ్యం, కర్నూలు, నాగలాపురం, ప్యాలకుర్తి, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఆదోనిలో ఖద్దరు నిధికి చందాలు వసూలు చేశారు.

ఆలూరుకు ప్రత్యేక గుర్తింపు

తెల్లదొరలపై తిరగబడి స్వాతంత్య్ర పోరాటంలో చెరగని ముద్ర వేసుకున్నారు ఆలూరు నియోజకవర్గంలోని వీరులు. ఇక్కడి నుంచి సంజీవరెడ్డి, గోవిందదాసు, అక్బర్ అలీ, పుల్లా అయ్యపరెడ్డి, హెచ్.బసవన్నగౌడ్, బొగ్గుల బాలయ్య, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమప్ప నాయక్, పాపయ్య చౌదరి లాంటి వారు స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నారు. తెల్లదొరలను ఎదిరించి జైలు జీవితం గడిపారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడంతో వీరిని అరెస్ట్ చేసి బళ్లారిలోని హళ్లీపూర్ జైలులో ఉంచారు. తర్వాతి కాలంలో వీరికి గుర్తుగా ఆలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద స్థూపం ఏర్పాటు చేశారు. డి.గోవిందదాసు నియోజకవర్గ శాసన సభ్యులుగా సైతం సేవలు అందించారు.

ఆదర్శ వనిత పద్మావతమ్మ

స్వాతంత్య్ర ఉద్యమంలో ఆస్తి విరాళంగా ఇవ్వడంతో పాటు పోరాటం జరిపిన మహిళగా పద్మావతమ్మ నిలిచారు. అలాగే నేతాజీ సుభాష్ చంద్రబోస్ పిలుపు మేరకు బ్రిటీష్ ప్రభుత్వంలో పోలీస్‌గా పనిచేసిన శామ్యూల్ బెనెడిక్ట్ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. నంద్యాలకు చెందిన దేశాయి కప్పూరావు, కోడి నరసింహం, ఆత్మకూరు నాగభూషణం శెట్టి, ఎర్రబోలు సుబ్బారెడ్డి, యాతం మహానంది రెడ్డి, రాజా శ్రీనివాసలు స్వాతంత్య్ర పోరాటంలో స్ఫూర్తిగా నిలిచారు.


ముత్తుకూరు గౌడప్ప


వనం శంకరశర్మ



గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, కాదర్‌బాద్ నరసింహారావు

కలియుగ దాన కర్ణుడు బుద్దా వెంగళ రెడ్డి



ఉయ్యాలవాడలో వెంకమ్మ, నల్లపు రెడ్డి దంపతులకు 1822లో బుద్దావెంగళ రెడ్డి జన్మించారు. ఆపదల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుండేవారు. 1866లో డొక్కల కరువు వచ్చినప్పుడు గంజి కేంద్రం ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చారు. తన యావదాస్తి సుమారు వెయ్యి ఎకరాలు ధారపోసి ప్రజల కోసమే జీవించిన దాన కర్ణుడు. ఈయన సేవలకు బ్రిటీష్ రాణి బంగారు పతకం ఇచ్చి సత్కరించింది. 1900 డిసెంబర్ 31న ఈయన స్వర్గస్తులై చరిత్రలో నిలిచిపోయారు.

విద్యా ప్రధాత కసిరెడ్డి వెంకట రెడ్డి



కర్నూలులో కేవీఆర్ కళాశాల వ్యవస్థాపకుడు కసిరెడ్డి వెంకటరెడ్డి. మిడ్తూరు మండలం 49 బన్నూరుకు చెందిన ఈయన 1885లో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. చుట్టుపక్కల పిల్లలు ఉన్నత విద్యకు దూరంగా ఉంటున్న విషయాన్ని గమనించారు. కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలోని 14 ఎకరాలను 1956లో విరాళంగా ఇవ్వడంతో 1958 జులై 29న జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. రాయలసీమలో ఏర్పాటైన మొట్టమొదటి బాలికల జూనియర్ కళాశాలగా నిలిచిపోయింది. ప్రస్తుతం అక్కడ డిగ్రీ, పీజీ ఉన్నత విద్యను కూడా అభ్యసిస్తున్నారు.

రావుబహదూర్ రెడ్డి లక్ష్మమ్మ



1878లో పెండేకల్లులో జన్మించిన రెడ్డి లక్ష్మమ్మకు 8వ ఏటనే శివారెడ్డితో వివాహమైంది. రెండేళ్లలోనే భర్త చనిపోయారు. నిరాశతో కుంగిపోక సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 1932లో పత్తికొండలో వసతి గృహం నెలకొల్పి దాతల సహాయంతో పేద పిల్లలకు భోజనం పెట్టారు. అనాథలను వృద్ధిలోకి తెచ్చారు. ఆమె 1982లో మృతి చెందారు. కాగా 2015 వరకు ఎస్సీ బాలుర వసతి గృహం నడిచింది. ప్రస్తుతం ఆ భవనాన్ని ప్రభుత్వ బీసీ కళాశాల హాస్టల్‌గా మార్చారు. రెడ్డి లక్ష్మమ్మ సేవలకు గుర్తుగా ఆంగ్లేయులు బంగారు పతకాన్ని, రావుబహదూర్ బిరుదు ఇచ్చారు. 1932లో గాంధీజీ పత్తికొండను సందర్శించినప్పుడు ఆమె సేవా నిరతిని కొనియాడారు.

చెరువులను నింపేందుకు చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. గురువారం సాయంత్రం సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగునీటి సంఘాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఎంకు వివరించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు వందశాతం పూర్తియ్యాయని, ప్రస్తుతం 3850 క్యూసెక్కుల నీరు వెళ్తోందన్నారు. అలాగే కర్నూలు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా 68 చెరువులను నింపే పనులు కూడా చెపడుతున్నట్లు చెప్పారు. వీసీలో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ కబీర్‌బాషా, ఎస్ఈ బాలచంద్రారెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య, ఈఈ వెంకట్రాముడు పాల్గొన్నారు.

నీటి వనరులను పరిరక్షించండి

● జిల్లాలో తాగు, సాగునీటి వనరుల మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం మినీ కాన్ఫరెన్స్ హాలులో నీటి వనరుల మరమ్మతు, పునరుద్ధరణ, పునర్ నిర్మాణ పనులపై (ఆర్‌ఆర్‌ఆర్) జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఆర్‌ఆర్‌ఆర్ కింద చెరువులు, జలాశయాలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల మరమ్మతులు, పునర్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. జిల్లాలో 137 పనులను గుర్తించి రూ.167 కోట్లతో అంచనాలతో చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఇప్పటివరకు రోడ్డు వసతి లేని గ్రామాలకు ఆ సదుపాయం కల్పించడంతో ఆయా గ్రామాల ప్రజలు గురువారం కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రహదారులు లేని గ్రామాలు 27 ఉన్నాయని, మొదటి దశలో 14 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఆలూరు మండలం మొలగవల్లి కొట్టాల, ఆస్పరి మండలం చెన్నంపల్లి, అట్టెకల్, గోనెగొండ్ల మండలం గుళ్లమొరుసు, కర్నూలు మండలం బవాపురం, కోడుమూరు మండలం బైనాదొడ్డి, పత్తికొండ మండలం కురువులదొడ్డి, దేవకుంట, తుగ్గలి మండలం హుస్సేనాపురం, గూడూరు మండలం చిన్నకలుములపల్లి, హోళగుంద మండలం హొన్నూరు కొట్టాల, నెరణికి, కడ్లమాగి గ్రామాల్లో రూ.18 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని, ఇందులో పది గ్రామాలకు రహదారులు పూర్తి కాగా, 4 గ్రామాలకు రోడ్ల పనులు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. మిగతా 13 గ్రామాలకు రెండో దశలో రోడ్డు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఇన్‌చార్జ్ పీఆర్ ఎస్ఈ మాదన్న, రిటైర్డ్ పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖాధికారులు నిర్లక్ష్యం వీడాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కొందరు ఆర్ఎంపీలు అర్హత లేని టెక్నీషియన్లు విచ్చలవిడిగా స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి రాకపోవడం విడ్డూరమన్నారు. ఎవరైనా మరణించినప్పుడు మాత్రం హడావుడి చర్యలు తప్ప ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక ఆసుపత్రిలో రోగుల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

డైస్‌తో పిల్లలకు మంచి భవిష్యత్


డైస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డైస్) ద్వారా పిల్లలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్ ఉంటుందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన గురువారం డైస్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. డైస్‌లో కార్పొరేట్ స్థాయిలో చిన్నారులకు ఉచిత చికిత్స అందిస్తున్నారన్నారు. ప్రతి నెలా డైస్ కేంద్రంలో ఎదుగుదల లోపం, వైకల్యం తదితర సమస్యలతో నమోదవుతున్న పిల్లల వివరాలు, వారికి అందజేస్తున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. అనంతరం శస్త్రచికిత్సలు అవసరమైన బాలలకు డైస్ సెంటర్ ద్వారా ఉన్నత ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేయించి వారిలోని లోపాన్ని సవరిస్తారని తెలిపారు. పుట్టిన వెంటనే పిల్లల్లో ఏమైనా లోపాలు ఉంటే గమనించి డైస్ ద్వారా చికిత్స అందించి సవరణ చేస్తారని చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల, డైస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజన పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు మండలి అధ్యక్షురాలు పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండలి కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు వీఆర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు నృత్య పోటీలు, బాలగోకు లం, చిన్నికృష్ణులు, గోపికల వేషధారణ పోటీలు ఉంటాయన్నారు. గోపూజ, ఉట్లోత్సవం, వక్తలచే సందేశం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల్లోగా ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94925 50433, 99665 15684 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. మండలి సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

కర్నూలు కల్చరల్: ఈ నెల 16న తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

క్లస్టర్ వర్సిటీ ఐక్యూఏసీ కమిటీ ఏర్పాటు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా వీసీ, ఏఓలుగా రిజిస్ట్రార్, పరీక్షల విభాగం డీన్, పరిపాలన విభాగం డీన్, అకడమిక్ విభాగం డీన్, సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లను నియమించారు. డైరెక్టర్‌గా కేవీఆర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ మహబూబ్ బాషా, డిప్యూటీ డైరెక్టర్లుగా సిల్వర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్లా క్రిష్ణ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ కె.జీ మల్లికార్జున, సభ్యులుగా రాధారమణి (కేవీఆర్ కాలేజీ), బి.మసూదా వలి (ప్రభుత్వ పురుషుల కాలేజీ), సీహెచ్.నాగ సురేష్ (సిల్వర్‌జూబ్లీ కాలేజీ), ధర్మేందర్ (పురుషుల కాలేజీ), ఏబీఎల్ పావని (కేవీఆర్), ఆచార్య ఎస్.మన్సూర్ రెహ్మాన్ (సొసైటి), ఎస్.రాజశేఖర్ (ఫస్ట్ స్టెప్ టెక్నాలజీస్), పి.విజయ (ఏపీ టూరిజం), విజయకుమార్ రెడ్డి (సాయి డెకరేటర్స్), కురువ రమేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ బాంబే) కమిటీలో ఉన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఒంగోలులో ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన జరిగింది. హాజరైన నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ఒత్తిడి తేవాలని కోరారు. సహాయ కార్యదర్శులు ఎన్.లెనిన్‌బాబు, ఎస్. మునెప్ప, నాయకులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా

కల్లూరు: కర్నూలు నగరం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతి, యువకులు హాజరయ్యారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి దీప్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా శాంతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష కుసుమార్చన

కర్నూలు కల్చరల్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని స్థానిక సప్తగిరి నగర్‌లోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో చౌడేశ్వరీ దేవికి లక్ష కుసుమార్చన, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.